### బీసీల సర్వే అశాస్త్రీయం..




2014లో నిర్వహించిన సర్వేలో బీసీలు 51శాతం ఉండగా, 2025 నాటికి సంఖ్య పెరగాల్సింది పోయి 46శాతానికి పడిపోవడం విడ్డూరంగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎలా కుచ్చుటోపీ పెడుతుందో ఇట్టే అర్థమవుతున్నది. 2011లో నేషనల్ శాంపిల్ సర్వే, 2014లో కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జరిపిన ఎస్‌కేఎస్ సర్వే ద్వారా తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు 93శాతం ఉన్నారు. అందులో బీసీలే 51శాతానికి పైగా ఉన్నారని సర్వేలో తేలింది. కుట్ర పూరితంగా సీఎం రేవంత్‌రెడ్డి బీసీల జనాభా తగ్గించి బీసీ సమాజానికి తీరని అన్యాయం చేస్తున్నారు. చట్టబద్ధంగా 42శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇస్తామని ఇప్పుడు కోర్టు జడ్జిమెంట్‌ను కోడ్ చేస్తూ పార్టీపరంగా ఇస్తామని మాట మార్చడం దుర్మార్గం. బీఆర్‌ఎస్ మొదటి నుంచి కాంగ్రెస్ తీరును ఎండగడుతూనే ఉన్నది. ఇప్పటికైనా సమగ్రమైన సర్వే నిర్వహించి బీసీలకు న్యాయం చేయాలి. –కురువ విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు

### ఆది నుంచి వెనుకబడిన వారికి అన్యాయం..



స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి దేశంలో వెనుకబడిన తరగతుల వారికి అన్యాయం జరుగుతూనే ఉంది. కుల గణన చేపట్టి న్యాయం చేయాలని గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాటం చేస్తున్నప్పటికీ ఏ ప్రభుత్వం పట్టించుకోలేదు. స్వయానా బీసీకి చెందిన ప్రధాన మంత్రి మోదీ సమగ్ర కుల గణన చేపట్టనున్నట్లు ప్రకటించి మూడు సార్లు అధికారంలోకి వచ్చినా దాని గురించి పట్టించుకోలేదు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయలేని స్థితిలో బీజేపీ ఉన్నది. మన రాష్ట్రంలోనూ సింగిల్ విండో ఎన్నికల్లో డైరెక్టర్లకు రిజర్వేషన్లు కల్పించిన ప్రభుత్వాలు సొసైటీ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ల విషయంలో పట్టించుకోలేదు. ఇప్పటికైనా రాబోవు సింగిల్ విండో ఎన్నికల్లో బీసీలకు న్యాయం జరిగేలా రిజర్వేషన్లను వర్తింప జేయాలి. అలాగే, 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి.
– వీవీ గౌడ్, బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి




42శాతం రిజర్వేషన్లకు డిమాండ్

# అశాస్త్రీయంగా.. బీసీ కులగణన

- ఓట్ల కోసమేనంటూ బీసీ సంఘాల నేతలు, రాజకీయ వేత్తల మండిపాటు
- స్థానిక సంస్థల్లో అగ్రకులాలకు పెద్దపీట వేసే కుట్ర

కాంగ్రెస్ సర్కారు చేపట్టిన కులగణన సర్వేతో రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహజ్వాలలు ఎగిసిపడుతున్నాయి. పదేండ్ల కిందట 51శాతంగా ఉన్న బీసీల జనాభా కాంగ్రెస్ సర్కారులో 46 శాతానికి తగ్గించడమేమిటని బీసీ సంఘాలు, ప్రతిపక్షాలు సర్కారుపై దుమ్మెత్తి పోస్తున్నాయి. ఓట్ల కోసమే తప్పా కులగణనపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదని, ఇందుకు తాజా నివేదికే నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అగ్రకులాలకు అధికారం కట్టబెట్టాలనే ఉద్దేశంతో బీసీల సంఖ్యను తక్కువ చేసి చూపించారని ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ బీసీ కులగణన చేపడుతామని, రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పిస్తామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి నేడు విస్మరించడం సిగ్గుచేటని బీసీలు నిరసన తెలుపుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### తప్పుల తడకగా కులగణన సర్వే..



కులగణన సర్వే తప్పుల తడకగా అదరా బాదరా చేశారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహిస్తామని కాంగ్రెస్ చెప్పి ప్రస్తుతం వారి ఆశలపై నీళ్లు చల్లే ప్రయత్నం చేస్తున్నది. విద్యా, ఉద్యోగ రంగాల్లో అమలవుతున్న బీసీ రిజర్వేషన్లను, పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలను రద్దు చేసే కుట్రలో ప్రభుత్వం ఆలోచన చేస్తున్నది. 14నెలల రేవంత్ పాలనలో తెలంగాణలోని అన్నివర్గాల ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. –శ్రీనివాసులు,బీసీసంఘం నాయకులు

– శ్రీనివాసులు, బీసీసంఘం నాయకులు

### కులగణనలో శాస్త్రీయత కొరవడింది..



బలహీన వర్గాలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నమ్మించి మోసం చేసింది. కులగణనకు శాస్త్రీయత లేకుండా పోయింది. మొక్కుబడిగా సర్వే చేయడంతో బలహీన వర్గాలకు దక్కాల్సిన వాటా దక్కడం లేదు. బీసీలను తక్కువ చేసి చూపిస్తున్నారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేసే ఉద్దేశం ప్రభుత్వానికి ఏకోశాన లేదు. బీసీలకు అన్యాయం జరిగేతే సహించేది లేదు.
–నరసింహానాయుడు,బీసీ సంఘం నాయకులు



ఎమ్మెల్సీ కవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జాగృతి జిల్లా అధ్యక్షుడు గణేశ్

## ఎమ్మెల్సీ కవితను కలిసిన నాయకులు

కల్వకుర్తి, ఫిబ్రవరి 7 : భారత జాగృతి వ్యవస్థాక అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎమ్మెల్సీ కవితను శుక్రవారం హైదరాబాద్‌లో జాగృతి నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గణేశ్ మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో తెలంగాణ జాగృతిని బలోపేతం చేయడం కోసం ఎమ్మెల్సీ కవిత దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌యాదవ్, ఆంజనేయులు, శేఖర్, సైదులు, నాగరాజు పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి సమస్య వివరిస్తున్న దవాఖాన కాంట్రాక్ట్ వర్కర్లు

- మక్తల్ ఎమ్మెల్యే వాహనాన్ని అడ్డుకున్న కాంట్రాక్ట్ వర్కర్లు

ఆత్మకూరు, ఫిబ్రవరి 7 : ఆత్మకూరుకు వచ్చిన ఎమ్మెల్యే శ్రీహరి వాహనాన్ని దవాఖాన వర్కర్లు అడ్డుకున్నారు. తొమ్మిది నెలలుగా తమకు రావాల్సిన వేతనాలు రావడం లేదంటూ మూడు రోజులుగా సర్కారు దవాఖాన ఎదుట రిలే దీక్షలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మక్తల్ ఎమ్మెల్యే ఆత్మకూరుకు వచ్చిన క్రమంలో దవాఖాన ఎదుట కాంట్రాక్ట్ వర్కర్లందరూ రోడ్డుపైకి అడ్డంగా వచ్చి ఎమ్మెల్యే వాహనాన్ని నిలిపారు. 14మంది కాంట్రాక్ట్ వర్కర్లకు తొమ్మిది నెలలుగా వేతనాలు రావడం లేదంటూ వినతి పత్రం అందజేశారు. దీంతో ఎమ్మెల్యే సదరు కాంట్రాక్ట్ వర్కర్ల ఏజెన్సీ నిర్వాహకుడు వెంకటయ్యతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడగా, ప్రభుత్వం నుంచే బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. దీంతో ముందుగా రెండు నెలల వేతనాలు వర్కర్లకు వెంటనే అందజేయాలని, అనంతరం బిల్లుల మంజూరు ఫైల్‌ను తనవద్దకు తీసుకొస్తే సంబంధిత శాఖ అధికారులతో కలిసి బిల్లుల మంజూరుకు కృషి చేస్తానని కాంట్రాక్టర్‌కు సూచించారు. బిల్లులు మం జూరీ అయ్యేంతవరకు దీక్షలు విరమించబోమని వర్కర్లు పార్వతమ్మ, నాగమ్మ, శైలజ, బాలకిష్టమ్మ స్పష్టం చేశారు. ౮

## ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటేలో గోల్డ్‌మెడల్




బంగారు పతకం అందుకుంటున్న హుమేరాబేగం

మహబూబ్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 7 : ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ పట్టణం రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం ముగిసిన ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఈనెల 6 నుంచి 9వ తేదీ వరకు జరిగిన పోటీల్లో అండర్–10 విభాగంలో కింగ్ షోటోకాన్ కరాటే డూ ఇండియా విద్యార్థి హుమేరాబేగం బంగారు పతకం సాధించారు. ఫౌండర్ జహంగీర్ పాషా, జిల్లా క్రీడా సంఘాల నాయకులు అభినందించారు.

## గూడు చెదిరె..గుండెలవిసె..!



చారకొండలో బైపాస్ నిర్మాణంలో ఇల్లు కూల్చివేస్తే చెట్టుకిందనే గుడిసె వేసుకున్న బాధితుడు

- బైపాస్ రోడ్డుతో నేలమట్టమైన ఇండ్లు
- నిలువ నీడ లేక చెట్ల కిందే నివాసం
- బాధితులను పట్టించుకోని అధికారులు

చారకొండ, ఫిబ్రవరి 7 : బైపాస్ రోడ్డుకు అడ్డంగా ఉన్నాయని పేదలకు చెందిన ఇండ్లను పోలీసుల సాయంతో ఉన్నట్టుండి నేలమట్టం చేయడంతో బాధితుల బాధలు చెప్పుకోలేనివిగా మారాయి. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండల కేంద్రంలో జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చారకొండ–మర్రిపల్లి వరకు రెండు కిలోమీటర్ల వరకు నిర్మాణం చేపడుతున్న బైపాస్ రోడ్డు పేదలకు శాపంగా మారింది. బైపాస్ రహదారికి అడ్డంగా ఉన్నాయని పేదలకు చెందిన 29 ఇండ్లు అధికారులు, పోలీసుల తెల్లవారుజాముననే గ్రామాలకు చేరుకొని కష్టపడి నిర్మించుకున్న ఇండ్లను నేలమట్టం చేశారు. దీంతో మర్రిపల్లికి చెందిన నూనె విష్ణుకు బైపాస్‌లో నిర్మాణంలో తనకున్న 262 గజాల్లో నిర్మించుకున్న ఇండ్లను కూల్చేశారు. పరిహారం తీసుకోకుండానే ఇండ్లు పూర్తిగా అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే కూల్చారు. దీంతో దిక్కుతోచని స్థితిలో ఉండటానికి జాగ లేకపోవడంతో బైపాస్ సమీపంలోనే ఓ చెట్టు కింద గుడిసె వేసుకున్నాడు. కుటుంబ సభ్యులతో అక్కడే వంట చేసుకొని ఉంటున్నారు.

### మమ్మల్ని రోడ్డున పడేశారు..



జాతీయ రహదారి విస్తరణలో భాగంగా బైపాస్ రోడ్డు నిర్మాణం గురించి మాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. మా బంధువు చనిపోతే ఊరికి వెళ్లి వచ్చేసరికి మా ఇంటిని పోలీసుల పర్యవేక్షణలో అధికారులు కూల్చేశారు. మా సామన్లు తీసుకుంటామంటే కూడా తీయనివ్వకుండా వాళ్లే తీసుకెళ్లి ఓ గోదాంలో పడేశారు. తీసుకెళ్లిన సామన్లు కూడా ఇవ్వలేదు. వేసుకోవడానికి బట్టలు, వండుకోవడానికి వంట సామన్లు లేవు. మా ఇండ్లు కూల్చి అధికారులు పైశాచిక ఆనందం పొందా రు. ఇంటి స్థలంతోపాటు ఇండ్లు నిర్మించి పరిహారం చెల్లించి ఆదుకోవాలి. – నూనె విష్ణు, మర్రిపల్లి, చారకొండ మండలం

## ఇంకెంత మంది ప్రాణాలు తీస్తారు?

- విద్యార్థుల జీవితాలతో చెలగాడటం సరికాదు
- కాంగ్రెస్ వచ్చాక 56 మంది గురుకుల విద్యార్థులు మృతి
- సీఎం బాధ్యత వహించి రాజీనామా చేయాలి
- బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్
- విద్యార్థిని ఆరాధ్య కుటుంబాన్ని పరామర్శించిన ఆర్‌ఎస్పీ, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

వెల్దండ, ఫిబ్రవరి 7 : పేద విద్యార్థులకు చదువు చెప్పి వారి జీవితాల్లో వెలుగులు నింపాల్సిన కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంతో వారికి జీవితమే లేకుండా చేస్తున్నదని బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు. శుక్రవారం మండలంలోని చొక్కన్నపల్లిలో బాలానగర్ గురుకుల పాఠశాలలో మృతిచెందిన విద్యార్థిని ఆరాధ్య కుటుంబాన్ని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఫుడ్ కమిషన్ రాష్ట్ర చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, మాజీ జెడ్పీటీసీ విజితారెడ్డితో కలిసి ప్రవీణ్‌కుమార్ పరామర్శించారు. విద్యార్థిని మృతదేహంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో గురుకులాలను మృత్యుకుహారాలుగా మార్చారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 56 మంది గురుకుల విద్యార్థులు మృతి చెందారని, విద్యాశాఖ మంత్రి బాధ్యతలు నిర్వహిస్తున్న సీఎం విద్యార్థుల మృతికి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణలో రాక్షసపాలన సాగుతుందని, ఆరాధ్య మృతి అనుమానంగా ఉందన్నారు. విచారణ చేపట్టి నిజనిజాలను తేల్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే గురుకుల విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నాయని ఆరోపించారు. ఆరాధ్య కుటుంబానికి రూ.5కోట్లు పరిహారం, డబుల్ బెడ్రూం ఇల్లు, ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గోళి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆరాధ్య మృతి చెందడంలో కుట్ర దాగి ఉన్నదన్నారు. ప్రభుత్వం వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థిని తల్లిదండ్రులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యార్థిని తల్లిందండ్రులను ఓదార్చి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ రూ.51వేలు, జైపాల్‌యాదవ్ రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుట్టారాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాములమ్మ, బీఆర్‌ఎస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, యాదగిరి, ఆనంద్, ప్రసాద్, శేఖర్, రమేశ్, రవి, జంగయ్య తదితరులు ఉన్నారు.

### 13న రైతుదీక్షను విజయవంతం చేయాలి

వెల్దండ, ఫిబ్రవరి 7 : ఈనెల 13వ తేదీన బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆమనగల్లులో 15వేల మందితో రైతు దీక్ష చేపడుతున్నట్లు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం వెల్దండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర నేత ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, ఫుడ్ కమిషన్ రాష్ట్ర చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్‌తో కలిసి మాట్లాడారు. నియోజకవర్గంలో 6మండలాల నుంచి రైతులు, అభిమానులు, కార్యకర్తలు రానున్నట్లు తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీపీ పుట్టారాంరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు చల్లా మధుసూదన్‌రెడ్డి, యాదగిరి, ఆనంద్, ప్రసాద్, శేఖర్, రమేశ్, రవి, శ్రీను, నర్సింహ, రాజు ఉన్నారు.

## కార్యకర్తలకు అండగా ఉంటాం



కార్యకర్తల కుటుంబీకులకు బీమా చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

- నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి
- పార్టీ బీమా చెక్కుల పంపిణీ

తిమ్మాజిపేట/బిజినేపల్లి, ఫిబ్రవరి 7 : కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలని, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. తిమ్మాజిపేటకు చెందిన కదిరి పాండు, అమ్మపల్లికి చెందిన బాలరాజు కొన్నాళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. వారికి పార్టీ తరఫున బీమాకు సంబంధించి రూ.2లక్షల చొప్పున ఇద్దరికి పరిహారం చెక్కు లు మంజూరయ్యారు. వాటిని మర్రి జనార్దన్‌రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. గ్రామస్థాయిలో పటిష్టం చేయడంలో కార్యకర్త పాత్ర కీలకమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలన్నారు. నిరంతరం ప్రజాక్షేత్రంలో ఉండి, వారికి మద్దతుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు జోగు ప్రదీప్, మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వేణుగోపాల్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, నాయకుడు స్వామి పాల్గొన్నారు. అదేవిధంగా బిజినేపల్లి మండలంలోని కారుకొండకు చెందిన భీముడి కుటుంబానికి రూ.2లక్షల పార్టీ బీమా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, శేఖర్‌రావు, శ్రీను తదితరులు ఉన్నారు.

### బాధిత కుటుంబాలకు పరామర్శ..

నాగర్‌కర్నూల్/తిమ్మాజిపేట, ఫిబ్రవరి 7 : నాగర్‌కర్నూల్ మండలం నర్సాయిపల్లిలో ఇటీవల మృతిచెందిన ఎరక కుర్మయ్య కుటుంబాన్ని, తిమ్మాజిపేట మండలం అప్పాజిపల్లిలో గాయపడిన రవీందర్‌రెడ్డిని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. తిమ్మాజిపేటలో మాజీ జెడ్పీటీసీ కృపానందం మనుమరాలు మృతిచెందడంతో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు.

### గురుకులాన్ని పరిశీలించిన డీఎస్పీ

బాలానగర్, ఫిబ్రవరి 7 : బాలానగర్ మండల కేంద్రంలోని బాలికల గురుకులాన్ని డీఎస్పీ వెంకటేశ్వర్లు శుక్రవారం పరిశీలించారు. గురువారం బాలికల గురుకులంలో నాగరకర్నూల్ జిల్లా వెల్దండ మండలం చొక్కన్నపల్లికి చెందిన పదో తరగతి విద్యార్థిని ఆరాధ్య ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం గురుకులానికి వచ్చిన డీఎస్పీ బాలిక ఆత్మహత్య చేసుకున్న తరగతి గదిని పరిశీలించారు. బాలిక బలవన్మరణానికి సంబంధించి అధ్యాపకులు, సిబ్బందితో మాట్లాడారు. ఆత్మహత్యకు వినియోగించిన చీరను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

- కారును ఢీకొట్టిన డీసీఎం, కంటైనర్
- ఇద్దరు మృతి, నలుగురికి గాయాలు

పెద్దమందడి, ఫిబ్రవరి 7 : జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, మరో నలుగురికి తీవ్ర గాయాలైన ఘటన పెద్దమందడి మండలం వెల్టూరు సమీపంలో చోటుచేసుకున్నది. ఎస్సై యుగంధర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నందికొట్కూరుకు చెందిన చిన్నబాబు, అతడి భార్య హాజరంబీ, కొడుకు మౌలాలి, కోడలు సిద్ధంబీ, మనువడు సాఫియాన్, మనుమరాలు జహ్నవి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి నందికొట్కూరుకు జాతీయ రహదారి–44పై కారులో బయల్దేరారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని వెల్టూరు గ్రామ సమీపంలోని బలీద్‌పల్లి చౌరస్తా వద్దకు రాగానే ముందుగా వెళ్తున్న డీసీఎం సడన్ బ్రేక్ వేయడంతో వెనకాల వస్తున్న కారు డీసీఎంను ఢీకొట్టగా కారు వెనకాల ఉన్న మరో భారీ కంటైనర్ కారును ఢీకొట్టింది. కంటైనర్, డీసీఎం మధ్యలో కారు ఇరుక్కుపోయి నుజ్జునుజ్జయ్యింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న చిన్న బాబు భార్య హాజరంబీ(45), మనుమడు సాఫియాన్(10) అక్కడిక్కడే మృతిచెందగా, చిన్న బాబు, సిద్ధంబీ, మౌలాలి, జహ్నవికి గాయాలు కాగా, వీరిని హైదరాబాద్, మహబూబ్‌నగర్‌కు చికిత్స కోసం తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.



ప్రమాదం జరిగిన కారులోంచి మృతదేహాలను బయటకు తీస్తున్న హైవే సిబ్బంది

## సరోజిని దవాఖాన ప్రారంభం

జడ్చర్ల, ఫిబ్రవరి 7 : జడ్చర్ల పట్టణంలో శుక్రవారం సరోజిని మల్టీస్పెషాలిటీ దవాఖానను ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా దవాఖాన అధినేత దూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు జడ్చర్లలో దవాఖానను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జనరల్ సర్జన్ స్పెషలిస్ట్ ప్రత్యూష రెడ్డి, ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్ గౌతమ్ రెడ్డి, పిడియాట్రిక్ స్పెషలిస్ట్ తరుణ్‌రెడ్డి, గైనిక్ స్పెషలిస్ట్ శ్వేతారెడ్డితో ప్రముఖ డాక్టర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు.



దవాఖాన ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం